www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 4 ఫిబ్రవరి 2025

5

పశ్చిమ గోదావరి

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - కాళ్ల



పనులను పరిశీలిస్తున్న ఆదినారాయణ

మండలంలోని కాళ్ల గ్రామంలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ చట్టం పనులు సోమవారం ఉపాధి హామీ జిల్లా అంబుడ్స్ పర్సన్ జె.ఆదినారాయణ పరిశీలించారు. ఉపాధి హామీ కూలీల పనిదినాలు, తదితర వసతులను గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. వేతనదారులకు సలహాలు ఇస్తూ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచనలిచ్చారు. ప్రస్తుతం ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ఉపాధి హామీ కూలీలను పనుల ఎండవేడిమికి గురికాకుండా ఉదయం పూటే పనులకు వచ్చి సకాలంలో పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. పనుల్లేని కూలీలకు ఉపాధి హామీ పనులు ఎంతగానో తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పంచాయతీల్లో 'లెక్క' లేదు..!

'ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు మండలం వెలమిల్లి పంచాయతీలో రూ.కోటికిపైకి నిధులు దుర్వినియోగం. పెదవేగి మండలం నడిపల్లి పంచాయతీలో రూ.30 లక్షల నిధులు దుర్వినియోగం అయినట్లు అక్కడి ప్రజలు ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకూ అవినీతి వ్యవహారం గుట్టు వీడలేదు. డివిజన్ పంచాయతీ అధికారి అవినీతి అధికారులకు కొమ్ము కాస్తున్నారంటూ జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పరిస్థితి నెలకొంది.'

'పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం చినఅమిరం గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదులు వెల్లువెత్తగా, విచారణ నిర్వహించిన అధికారులు రూ.2.73 కోట్లు నిధులు దుర్వినియోగం అయినట్లు తేల్చారు. దీంతో సదరు కార్యదర్శిపై క్రిమినల్ కేసులు పెట్టి ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్న పరిస్థితి ఉంది.'

నిధుల దుర్వినియోగంపై గ్రామాల్లో తీవ్ర చర్చ

హాట్ టాపిక్‌గా మారుతున్న కార్యదర్శుల వ్యవహార శైలి

అవినీతికి కొమ్ముకాస్తున్న ప్రజా ప్రతినిధులు

తప్పుడు ఆడిట్‌లతో కొనసాగుతున్న అవినీతి వ్యవహారం

ఇష్టానుసారంగా వెండర్ ఖాతాల్లోకి సొమ్ములు మళ్లింపు

అవినీతి అధికారులకు, మండల పంచాయతీ డివిజన్ అధికారుల అండ

పంచాయతీ నిధులు ప్రజలకు చేరేదెలా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగంపై భయటపడుతున్న ఘటనలు ఒకటి, రెండు మాత్రమే. ఏలూరు జిల్లాలో 27 మండలాలు ఉండగా 547 పంచాయతీలు, పశ్చిమలో 20 మండలాల పరిధిలో 409 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. రెండు జిల్లాల్లో చాలా పంచాయతీలకు సంబంధించి సగానికి సగం నిధులు పక్కదారి పడుతున్నట్లు గ్రామాల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. గ్రామాల్లో పంచాయతీ అధికారులు అవినీతి సామ్రాట్లుగా మారుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా ప్రతినిధులతో చేతులు కలిపి ప్రజలకు చేరాల్సిన నిధులను ఇష్టానుసారంగా దారి మళ్లించి వాటాలు పంచుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తే తప్ప పట్టించుకోవడం లేదు. మండలాధికారులకు గానీ, పంచాయతీ డివిజన్ అధికారులకుగానీ ఫిర్యాదులు చేసినా ఎటువంటి ఫలితమూ ఉండడం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు. ముఖ్యంగా ఏలూరు జిల్లాకు సంబంధించి ఏదైనా పంచాయతీపై అవినీతి ఫిర్యాదు వస్తే పంచాయతీ డివిజన్ అధికారిని విచారణ అధికారిగా నియమిస్తున్నారు. అవినీతి అధికారులకు డివిజన్ అధికారి కొమ్ముకాస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెదవేగి మండలం నడిపల్లిలో విచారణకు వెళ్లిన డివిజన్ అధికారిని వెళ్లిపోవాలంటూ అక్కడ ప్రజలు నిరసనలు చేపట్టారంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. పంచాయతీలకు సంబంధించి కింద నుంచి పైవరకూ పెద్దవ్యవస్థ ఉన్నప్పటికీ అవినీతి ఇష్టానుసారంగా సాగడానికి కారణాలపై ప్రభుత్వంగానీ, జిల్లా కలెక్టర్లుగానీ దృష్టిసారించడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీల్లో సొమ్ము దారిమళ్లించడం సర్వ సాధారణం అన్నరీతిగా మారిపోయింది. రూ.కోట్ల సొమ్ము దారి మళ్లించినా జనం ఫిర్యాదు చేసే వరకు పైస్థాయి అధికారులు ఏంచేస్తున్నట్లు అన్న ప్రశ్నలకు సమాధానం లేకుండా పోయింది. పంచాయతీ అధికారి కార్యదర్శిపై మండలంలో ఇఒపిఆర్‌డి, ఎంపిడిఒ, డివిజనల్ పంచాయతీ అధికారి ఇలా మూడంచెల వ్యవస్థ ఉంది. అధికారులు పంచాయతీలకు పరిశీలనకు వెళ్లినప్పుడు రికార్డులు పరిశీలన చేస్తున్నారా.. అంటే లేదనే సమాధానం వస్తోంది. పరిశీలనకు వెళ్లిన అధికారులు మామూళ్లు తీసుకుని మౌనంగా వచ్చేస్తున్నారని, అందుకే పంచాయతీల్లో అవినీతి తారాస్థాయికి చేరిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంచాయతీల సొమ్ము దుర్వినియోగంపై ఉన్నతాధికారులు సైతం సరిగ్గా దృష్టి సారించడం లేదన్న చర్చ సాగుతోంది.

తప్పు ఆడిట్ నివేదికలు..

పంచాయతీల నిధుల ఖర్చులకు సంబంధించి ఏటా ఆడిట్ అధికారులు ఆడిట్ చేస్తారు. ఎక్కడా నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఒక్క విషయం బయటకురాని పరిస్థితి. ప్రజల ఫిర్యాదులతో అవినీతి బయటపడిన పంచాయతీలు సైతం ఆడిట్ జరిగినవే. ఆడిట్ అధికారులను తమవైపునకు తిప్పుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. పంచాయతీల వెండర్ ఖాతాలకు సంబంధించి కార్యదర్శులు ఇష్టానుసారంగా ప్రారంభించి సొమ్ములు దుర్వినియోగం చేస్తున్నా ఆడిట్ అధికారులు ఎందుకు గుర్తించడం లేదో తెలియని పరిస్థితి నెలకొంది. పంచాయతీల్లో వెండర్ ఖాతాల ముసుగులో జరుగుతున్న అవినీతి అత్యధికంగా ఉంటుంది. బిల్లుల్లో సైతం తప్పుడు బిల్లులే అధికంగా ఉంటున్నాయని చెబుతున్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది. పంచాయతీల్లో నిధులు సగానికి సగం దారి మళ్లిపోతుంటే గ్రామీణ ప్రజలకు ఏవిధంగా మేలు జరుగుతుందో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. పంచాయతీల్లో అవినీతి అడ్డుకట్టకు ప్రత్యేక చర్యలు తీసుకుంటే తప్ప ప్రజలకు న్యాయం జరిగే పరిస్థితి ఉండదు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

ముగిసిన సిపిఎం రాష్ట్ర మహాసభ

రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా బి.బలరాం, రాష్ట్ర కమిటీ సభ్యులుగా జెఎన్‌వి గోపాలన్ ఎన్నిక

కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గా మంతెన సీతారాం

నెల్లూరులో ఈనెల ఒకటో తేదీ నుంచి 3వ తేదీ వరకూ జరిగిన సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలో చివరి రోజు సోమవారం నూతన కమిటీ ఎన్నికైంది. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన బి.బలరాం ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా పశ్చిమగోదావరి నుంచి ఆ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ ఎన్నికయ్యారు. ఏలూరు జిల్లా నుంచి ఆ జిల్లా కార్యదర్శి ఎ.రవి. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగమణి ఎన్నికయ్యారు.

కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గా మంతెన సీతారాం..

సిపిఎం రాష్ట్ర మహాసభలో కంట్రోల్ కమిషన్ ఐదుగురుతో ఎన్నికైంది. ఆ కమిషన్ సమావేశమై ఛైర్మన్‌గా మంతెన సీతారాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈయన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పూర్వ కార్యదర్శిగా, సిపిఎం రాష్ట్ర కార్య దర్శి వర్గ సభ్యులుగా పనిచేశారు.

తీరప్రాంత పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

తీర ప్రాంత గ్రామాల పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని విద్యాశాఖ అధికారులను, ప్రధానోపాధ్యాయులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ నాగరాణి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు, పాఠశాలల పునర్ వవస్థీకరణపై డిఇఒ, నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, యలమంచిలి మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమీక్షించి మాట్లాడారు. పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ఒక్క విద్యార్థి కూడా డ్రాప్ అవుట్ కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాల పిల్లలు డ్రాప్‌అవుట్స్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేయకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రయివేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న పిల్లలకు చక్కటి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. పునర్‌వ్యవస్థీకరణపై విద్యార్థుల తల్లిదండ్రులకు అర్థమయ్యే రీతిలో అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఒకరిద్దరు ఉన్న పాఠశాలల కన్నా, ఎక్కువ మంది విద్యార్థులు కలిగిన పాఠశాలలో చదువుకోవడం ద్వారా ఒకరి నుండి ఒకరికి అనేక విషయాలు తెలుసుకోవడానికి వీలవుతుందని, తద్వారా వారికి మంచి ఆలోచనలు, తెలివితేటలు కలుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, యలమంచిలి మండలాల ఎంఇఒలు పి.పుష్పరాజ్యం, జి.జాన్ ప్రభాకర్, జి.వీరాస్వామి, ఎన్‌వియస్‌జి.శర్మ, డి.సుభకరరావు, కె.వెంకట రామకృష్ణ రాజు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆడపిల్లల ఆత్మరక్షణ అందరి బాధ్యత

జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - పెనుమంట్ర

బాలికలకు అన్ని విధాలుగా అండగా నిలవడంతోపాటు, వారి బంగారు భవిష్యత్తుకు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం మండలంలోని మార్టేరు - నెగ్గిపూడి గ్రామం వేణుగోపాలస్వామి ఉన్నత పాఠశాలలో 'ఆడపిల్లల ఆత్మరక్షణ' కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లాలో మొట్టమొదటిగా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రసిక్షన్ శిక్షణ కార్యక్రమాలు జిల్లాలో సోమవారం నుంచి మార్చి 15వ తేదీ వరకూ 32 రోజుల పాటు పని దినాల్లో ప్రతి పాఠశాలలో రోజుకు గంట చొప్పున 20 రోజులపాటు, జిల్లాలో ప్రతి పాఠశాలలో జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మార్చి 15వ తేదీలోగా పూర్తయ్యేలా కార్యక్రమాన్ని డిజైన్ చేశామన్నారు. రూపేష్ వెల్ఫేరు సొసైటీ నుంచి 50 మంది కరాటే ఉపాధ్యాయులను కేటాయించామన్నారు. కార్యక్రమం ముఖ్యోద్దేశం బాలికలు విద్యలో రాణించడంతోపాటు బలంగా ఉండడం, ఆత్మవిశ్వాసంతోపాటు సాధికారతపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. బాలికలు తమను తాము

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

రక్షించుకునే నైపుణ్యం, విశ్వాసంతో సాధికారత కల్పించేందుకు రూపొందించిన పరివర్తనాత్మక స్వీయ-రక్షణ శిక్షణా కార్యక్రమం అన్నారు. మాస్టరింగ్ సెల్ఫ్ - డిఫెన్స్ - జూడో, ట్రైక్వాండో, కరాటేలో బలం మరియు చురుకుదనం పెంపొందించడానికి శిక్షణ ఇస్తుందన్నారు. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించడం, అసురక్షిత పరిస్థితులను గుర్తించడం, సమర్థవంతంగా స్పందించడం ఎలా నేర్చుకోవాలో తెలియజేస్తారన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఈ శక్తివంతమైన కార్యక్రమం 80 ప్రాథమికోన్నత పాఠశాలలు, 230 ఉన్నత పాఠశాలలకు చేరుకుంటుందని, 6 నుండి 9 తరగతుల వరకూ సుమారు 25,000 మంది బాలికలకు ప్రయోజనం చేకూరుస్తోందని తెలిపారు. ప్రతి విద్యార్థినీ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆడపిల్లలు ఆత్మరక్షణ శారీరక, మానసిక ధృఢత్వాన్ని అలవర్చుకుంటారని, ప్రతి సమస్యనూ ఒంటరిగా ఏ విధంగా పరిష్కరించుకోవాలో ఏ విధంగా ఆత్మస్థైర్యంతో జీవితంలో ముందుకెళ్లాలో అవగాహన కల్పిస్తారని తెలిపారు. 18 ఏళ్ల వచ్చేవరకు చదువు మానేయకుండా ముందుకెళ్లాలన్నారు. జిల్లా యంత్రాంగం తరపున బాలికలకు సంపూర్ణ సహకారాన్ని, భద్రతను అందిస్తామని హామీ ఇచ్చారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, సర్వశిక్ష అభియాన్ ఎపిసి పి.శ్యామ్ సుందర్, కమ్యూనిటీ ఇన్మ్యూషన్ అధికారి వై.చంద్రశేఖర్, తహశీల్దార్ ఎవై.రవికుమార్, ఎంపిడిఒ పి.శామ్యూల్ పాల్గొన్నారు.

కార్పొరేట్ల అనుకూల బడ్జెట్

సిపిఎం ఆధ్వర్యాన పలుచోట్ల నిరసనలు

గణపవరంలో దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - గణపవరం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సోమవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో జల్లికాకినాడలో దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పెచ్చెట్టి నరసింహమూర్తి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ ప్రజా వ్యతిరేక బడ్జెట్ అన్నారు. కార్పొరేటర్లకు అనుకూలంగా ఉందని విమర్శించారు. రైతాంగానికి, కార్మికులకు, వివిధ రంగాలకు కేటాయింపులు గతం కంటే తగ్గించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సోడదాసి సంజీవిరావు, ఓగిరాల మహేష్, అనిపే కళ్యాణ్, పాలవెంకటేశ్వరరావు, అయినవల్లి శ్రీను, జాలే సత్తేయ్య పాల్గొన్నారు.

పాలకోడేరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని సిపిఎం మండల కార్యదర్శి శేషాపు ఆశ్రయ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా విస్సా కోడేరు రావిచెట్టు సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ్రయ మాట్లాడుతూ రైతులు, కార్మికులతో పాటు వివిధ రంగాలకు కేటాయింపులు గతం కంటే తగ్గించారని అన్నారు. ఎన్నికలు, ఓట్లను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌ను కేటాయించడం కేంద్ర పాలకులకు రివాజుగా మారిందని అన్నారు. విభజన హామీలకు అనుగుణంగా బడ్జెట్ ఉందని రాష్ట్ర పాలకుల్లో కొంతమంది చెప్తున్నారని, అది అవాస్తవం అన్నారు. ప్రత్యేక హోదా, రైల్వేజోన్, పోలవరం నిర్వాసితులు వంటి సమస్యలకు రిక్త హస్తమే చూపించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలిదిండి గోపాలరాజు, సత్యనారాయణ, ఏడుకొండలు పాల్గొన్నారు.

పెంటపాడు : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మరోసారి రాష్ట్రానికి ద్రోహం చేసిందని సిపిఎం మండల కన్వీనర్ సిరపరుపు రంగారావు విమర్శించారు. సోమవారం పెంటపాడు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద కేంద్ర బడ్జెట్ పత్రాలని దగ్ధం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం మండల కన్వీనర్ సిరపరుపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఎనిమిదో సారి ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లోనూ సామాన్యులకు కోతలు, సంపన్నులకు వరాలు కురిపించారని కేంద్ర ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దూలం ప్రసాద్, పెనగంటి దుర్గా, దత్తు రాము, తెర్లి రాజేష్, పైలి ప్రసాద్, బంకురు మణికంఠ పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్ర రాష్ట్రానికి మరోసారి ద్రోహం జరిగిందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ విమర్శించారు. సోమవారం వెంప బస్టాండ్ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్ర ప్రజల ఆశలు అడియాసలు చేసిందన్నారు. రాష్ట్రానికి విభజన హామీలు, కేంద్ర, గిరిజన, సెంట్రల్ యూనివర్సిటీ, ఐఐటి, ఐఎం, ట్రిపుల్ ఐటీ నిధులు ప్రస్తావించలేదన్నారు. ఆంధ్రకు ప్రత్యేక హోదా, రైల్వే జోన్, వెనుకబడిన జిల్లాలకు నిధులు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రాజధాని నిర్మాణానికి నిధులు, పోలవరం ప్రాజెక్టు నిధులు, పోలవరం నిర్వాసిత సమస్యలు, నిధులు ప్రస్తావించలేదన్నారు. ఈ బడ్జెట్ ప్రజలందరూ వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమాణి సూర్యనారాయణ, వేగిప్రసాద్, సానబోయిన సత్యనారాయణ, శ్రీను, బల్ల ఏమిలియా పాల్గొన్నారు.



భీమవరం టౌన్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

విద్యార్థుల అభ్యున్నతికి మార్కండేయులు కృషి

ఎంఎల్‌సిలు ఇళ్ల వెంకటేశ్వరరావు, గోపీమూర్తి

ప్రజాశక్తి - నరసాపురం

మార్కడేంయులు సన్మానిస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ఉపాధ్యాయునిగా విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయడమే కాకుండా, యుటిఎఫ్ నాయకునిగా మార్కండేయులు ఉపాధ్యాయుల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారని ఎంఎల్‌సిలు ఐ.వెంకటేశ్వరరావు, బొర్రా గోపీమూర్తి అన్నారు. పట్టణంలో ఎన్‌జిఒ హోమ్‌లో మార్కండేయులు ఉద్యోగ విరమణ అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఇళ్ల వెంకటేశ్వరరావు, గోపీమూర్తి మాట్లాడుతూ మండలంలో పలు పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేసి అనేక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శిగా, జిల్లా గౌరవాధ్యక్షునిగా అనేక ఉద్యమాల్లో, ధర్నాల్లో పాల్గొని ఉపాధ్యాయుల సమస్యలపై పరిష్కారానికి నిరంతరం కషి చేసిన మార్కండేయులు యూటిఎఫ్ బలోపేతానికి ఎనలేని కృషి చేశారన్నారు. అనంతరం కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎ జానకీరామ్ మాట్లాడుతూ విద్యా రంగానికి మార్కండేయులు ఎనలేని కృషి చేశారని, ఎందరో విద్యార్థులను విద్యావంతులుగా మార్కండేయులు తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీదేవి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, అజయ్, కె.మాణిక్యాలరావు, సుధీర్, రాజ్యశ్రీ పాల్గొన్నారు.

మురుగు కాలువను ప్రక్షాళన చేయాలి

రైతులను ఆదుకోవాలి

మాజీ సర్పంచి కూనపరెడ్డి రంగారావు

ప్రజాశక్తి - నరసాపురం

రుస్తుంబాద గ్రామంలో ఉన్న మురుగు కాలువ(డ్రెయిన్)ను ప్రక్షాళన చేసి రైతులకు న్యాయం చేయాలని సర్పంచి ఛాంబర్ మాజీ అధ్యక్షుడు, వైఎస్ పాలెం మాజీ సర్పంచి కూనపరెడ్డి వీర వెంకట విజయ రంగారావు అన్నారు. నర్సాపురం మండలం రుస్తుంబాద గ్రామంలో బాధిత రైతులతో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ రుస్తుంబాద మురుగు కాలువను ఆనుకుని ఉన్న సుమారు 400



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఎకరాల పంట పొలాల్లో గత ఆరేళ్ల నుంచి మురుగునీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో సార్వా, దాళ్వా పంటలు పండించే అవకాశం లేదన్నారు. పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు ఇళ్లల్లోని, దుకాణాల్లో వ్యర్థ జలాలను ఈ రుస్తుంబాద మురుగు కాలువకు అనుసంధానం చేయడం వల్ల పంట పొలాల్లో ఉండే మురుగునీరు బయటకు వెళ్లే పరిస్థితి లేక, మురుగు కాలువ పూడికతీత పనులు చేపట్టకపోవడం, పలుచోట్ల మురుగు కాలువ ఆక్రమణకు గురవడం వల్ల పంటలను రైతులు పండించే అవకాశం లేదన్నారు. ఈ సమస్యను గతంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా ఫలితం శూన్యమన్నారు. వెంటనే మురుగు కాలువ ప్రక్షాళన చేసి, ఆక్రమణలను తొలగించి రైతులు పంటలు పండించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, స్థానిక ఎంఎల్ఎ నాయకర్, జిల్లా కలెక్టర్ నాగరాణిల దృష్టికి తీసుకెళ్తామని రంగారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు యర్రంశెట్టి నరసింహారావు, యడ్లపల్లి అర్జునుడు, బెల్లంకొండ పద్మారావు, యర్రంశెట్టి నరసింహారావు, యడ్లపల్లి బాలాజీ, యడ్లపల్లి మల్లిఖార్జునరావు, మైలబట్లుల శ్రీను ఉన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర



నిరసన వ్యక్తం చేస్తున్న కెవిపిఎస్ నేతలు

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లోని అయోధ్యలో దళిత యువతిపై అత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కెవిపిఎస్ ఆధ్వర్యాన జుత్తిగ గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్ కుమార్ మాట్లాడుతూ 76 ఏళ్ల స్వాతంత్రం తర్వాత కూడా ఇంకా దళితులపై, మహిళలపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయోధ్య సమీపంలోని ఓ గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువతి గురువారం రాత్రి భాగవతం వినేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లితే అత్యంత దారుణంగా హత్యాచారం చేసి, గ్రామ సమీపంలోని కాలువలలో కాళ్లు చేతులు విరగ్గొట్టి, కళ్లు పీకేసి, శరీరంలోని ఇతర చోట్ల తీవ్ర గాయాలు చేసి పడవేశారని అన్నారు. యువతి కనిపించట్లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే రక్షణ కల్పించాల్సిన వారు సరిగ్గా స్పందించలేదని, పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దళిత మహిళలకు రక్షణ కల్పించలేని ప్రభుత్వాలు ఎందుకు అని విమర్శించారు. ప్రధానమంత్రి మోడీ ఈ హత్యాచార ఘటనకు సమాధానం చెప్పాలని అన్నారు. వెంటనే ఉన్నతాధికారులకు హత్యాచార ఘటనపై దర్యాప్తు చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేసి, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షులు కండెల్లి కృష్ణ, కంకిపాటి నరేష్, సత్తిబాబు పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్లో కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం

విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న కమిషనర్

పట్టణంలోని 12 వ వార్డ్ ఆర్ఆర్ వారి వీధిలో ఉన్న మున్సిపల్ ప్రైమరీ ఇంగ్లీష్ స్కూల్ను సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పట్టీలను, విద్యార్థుల సంఖ్యలను, పాఠశాల పరిసరాలను కమిషనర్ పరిశీలించారు. కరెంట్ బిల్లులు, ఆయాలకి జీతంపై ఆరా తీసి, బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనం ఎలా వుంటుందని కమిషనర్ స్వయంగా రుచి చూశారు. ఉపాధ్యాయుల పనితీరుపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంపరాల సూర్య సత్య నాగలక్ష్మి పాల్గొన్నారు.

బిజిబిఎస్‌లో సర్వేచెట్టి వర్ధంతి

ప్రజాశక్తి - నరసాపురం

సర్వేచెట్టి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న శ్రీనివాస్

స్థానిక బి జిబిఎస్ మహిళా కళాశాలలో ఫౌండర్, హిందూ పునరుజ్జీవన సహాయ సంఘం వ్యవస్థాపకులు, పద్మశ్రీ అద్దేపల్లి సర్వేచెట్టి 33వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. తొలుతగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ సర్వేచెట్టి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నూలి శ్రీనివాస్ మాట్లాడుతూ సర్వేచెట్టి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం స్థానిక వృద్ధాశ్రమం, సాయిబాబా ఆలయంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కె.మధుశాలిని, సి.నీరజ పాల్గొన్నారు.

పశువులకు బొబ్బ వ్యాధి టీకాలు

నరసాపురం : పశువులకు ఉచిత బొబ్బ వ్యాధి టీకా సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యులు ఐ.సురేంద్ర కుమార్ అన్నారు. మండలంలోని సీతారాంపురం గ్రామంలో సోమవారం గొర్రెలకు, మేకలకు బొబ్బ వ్యాధి నివారణకు వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 800 గొర్రెలకు, 200 మేకలకు బొబ్బ వ్యాధి టీకాలు వేసినట్లు సురేంద్ర తెలిపారు. మండలంలో సుమారు 9 వేల గొర్రెలు, 3 వేల మేకలు ఉన్నాయని, పశువుల యాజమానులు తప్పకుండా వేయించాలన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

మొగల్తూరు : మొగల్తూరులోని శ్రీనివాస హాస్పిటల్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించనున్నామని వైద్యులు సిహెచ్.శ్రీనివాసరాజు తెలిపారు. పాలకొల్లుకు చెందిన రాజవల్లి రాధారమణ్ లయన్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నామన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నేత్రాజీ శిబిరాన్ని నిర్వహించనున్నామన్నారు. అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్సలు కూడా చేయనున్నారని శ్రీనివాసరాజు తెలిపారు. ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పలుచోట్ల సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు : చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న మంత్రి

పాలకొల్లు మాంటిస్సోరి స్కూల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం శాస్త్రోయంగా వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని అక్షర స్వీకారం చేసినటువంటి విద్యార్థులకు శుభాశీస్సులు అందిస్తూ తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. చిన్నారులకు మనం అందించే వెలకట్ట లేనటువంటి ఆస్తి విద్య మాత్రమేనని, కనుక తల్లిదండ్రుల శ్రద్ధ తీసుకుని విద్యార్థుల్ని ఉన్నత విద్యా వంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ చిలుకూరు కుమార్, కూటమి నేతలు జక్కంపూడి కుమార్, కొల్లి కొండ ప్రసాద్, గండేటి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి బాబు పాల్గొన్నారు.

నరసాపురం : పట్టణంలోని శ్రీసూర్య ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ వారు నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో సరస్వతి పూజ, అక్షరాభ్యాస కార్యక్రమాలు శోభయమానంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ద్విశతావధాని డాక్టర్ బులుసు అపర్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎన్నో విశిష్ట యాగాలు నిర్వహించిన ప్రముఖ సిద్ధాంతి పెద్దింటి అనిల్‌కుమార్ ఆచార్యులు ముఖ్య అతిథిగా విచ్చేసి గణపతి, సరస్వతుల పూజలు నిర్వహించి, వందలాదిగా విచ్చేసిన చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. ఈ స్థాయి సామూహిక కార్యక్రమంలో సరస్వతి ప్రసన్నత లభిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యతగా రిటైర్డ్ హెడ్ మాస్టర్, ప్రముఖ రచయిత దువ్వూరి రామ్మూర్తి వ్యవహరిస్తూ, తన 40 ఏళ్ల వృత్తి జీవితానుభవంలో ఇంతటి ఘనమైన అక్షరాభ్యాస క్రతువును చూడలేదని ప్రస్తావించారు. నరసాపురం పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ పద్మావతి ఈ అక్షరాభ్యాస మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెనుమంట్ర : వసంతపంచమి సందర్భంగా సోమవారం మండలంలోని మార్టేరు వివేకానంద ఇంగ్లీష్ స్కూల్ ఆధ్వర్యంలో చదువుల తల్లి సరస్వతి దేవికి విద్యార్థులచే ప్రత్యేక పూజలు చేయించారు. నూతన విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం పురోహితులు వడగం విజయ్ కుమార్‌చే నిర్వహించారు. విద్యార్థులకు పలకలు, పెన్సిల్స్, బుక్స్, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్స్ జి.రామారెడ్డి, కె.శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

పెనుగొండ : వివేక బాల భారతి స్కూల్ ఆధ్వర్యంలో ఉచిత సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. సోమవారం ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ సుబ్బారాయుల రెడ్డి మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల నుంచి 400 మందికి పైగా విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో అత్యంత వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు గణపతి పూజ, విశిష్ట సరస్వతి పూజ, అక్షరాభ్యాసం అత్యంత వైభవంగా నిర్వహించి, వేద పండితులతో, వేదమంత్రాలతో ఆశీర్వాదాన్ని ప్రతి ఒక్క విద్యార్థికి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తోట సతీష్, ప్రిన్సిపల్ తోట సత్యదుర్గ పాల్గొన్నారు.

5న 'ఫీజు పోరు'ను విజయవంతం చేయాలి

ఆచంట : వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద తలపెట్టిన 'ఫీజు పోరు' ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పోడూరు జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు, పెనుమంట్ర ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి(వాసు రెడ్డి) పిలుపునిచ్చారు. తూర్పుపాలెంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో సోమవారం మాజీ మంత్రి చెరుకువాడ శ్రీ రంగనాథరాజు ఆదేశాల మేరకు వైసిపి నాయకులు ఫీజు పోరు ఆందోళన కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కర్రి రామలింగేశ్వరరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గుబ్బల వీరబ్రహ్మం పాల్గొన్నారు.

రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు

మొగల్తూరు : శాసనమండలి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో సోమవారం మొగల్తూరు పంచాయతీలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగింపు, విగ్రహాలకు ముసగులు వేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఎన్నికల నియమావళి పనులను చేపట్టారు.

రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్న సిబ్బంది

సంస్కృత భారతీ శిక్షణా కేంద్రం ప్రారంభం

తాడేపల్లిగూడెం : సంస్కృత భారతీ ఆంధ్రప్రదేశ్(విజయవాడ) శాఖ నిర్వహణలో తాడేపల్లిగూడెంలో ప్రప్రథమంగా సరలా సంస్కృత పరీక్ష సోమవారం స్థానిక రామచంద్రరావు పేట కొలచన మహతి నిర్వహణలో స్థానిక మహతీ సంస్కృత శిక్షణా కేంద్రం ఆవరణంలో నిర్వహించారు. ఈ పరీక్షకు శంకర మఠం నిర్వాహకులు వేమూరి రామమ్, గరికిపాటి బాపయ్య శర్మలు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఈ పరీక్షకు 16 మంది విద్యార్థులు హాజరైయ్యారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పాఠశాల హెచ్ఎం సత్యనారాయణరాజు

ప్రజాశక్తి - పాలకొల్లు

పూర్వ విద్యార్థుల సహకారంతో కెనరా బ్యాంకు సౌజన్యంతో రూ.14 లక్షలతో పాఠశాల అభివృద్ధికి తన చేతుల మీదుగా భూమి పూజ చేయడం చాలా ఆనందంగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టివి.సత్యనారాయణ రాజు అన్నారు. గొల్లకోడేరు జిల్లా పరిషత్ హై స్కూల్లో గతనెల 12వ తేదీన 1986-1991 ఆనాటి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అదే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి సుబ్బలక్ష్మి భర్త కెనరా బ్యాంకులో మంచి ఉన్నత స్థానంలో ఉన్నారు. ఆయన సహకారంతో పాఠశాల అభివృద్ధికి రూ.14 లక్షలను కెనరా బ్యాంకు ద్వారా నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో సోమవారం పాఠశాల

అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న హెచ్ఎం

ప్రధానోపాధ్యాయుడు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఎంతోమంది పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకుంటూ ఉంటున్నారు కానీ పాఠశాల అభివృద్ధికి ఇటువంటి సహకారం మీ బ్యాచ్ ద్వారా రావడం ఈ పాఠశాలలో చదువుకుంటే విద్యార్థుల అదృష్టమన్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు సరిగా లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా విద్యార్థులు భోజనం చేసేందుకు షెడ్డు లేక, ఉన్న పాఠశాల గ్రౌండ్ కూడా పల్లంగా ఉండటం, స్కూలుకి ఆర్చి లేకపోవడం, స్కూల్ చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడం కొంత ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఈ నిధులతో ఆ పనులన్నీ పూర్తవుతాయన్నారు. ఈ నిధులు రావడానికి సహకరించిన పూర్వ విద్యార్థులు సుబ్బలక్ష్మి, ఆమె భర్తకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ స్వామి, పూర్వ విద్యార్థులు ఎం.విజయ ప్రసాద్, పెరుమళ్ల శ్రీనివాస్, మర్రి శ్రీనివాస్, కుపల్లి కృష్ణంరాజు పాల్గొన్నారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు ఓవరాల్ ఛాంపియన్ షిప్

అభినందించిన వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడిఆర్ డాక్టర్ శ్రీనివాస్

ఛాంపియన్ షిప్ సాధించిన విద్యార్థులతో ఏడిఆర్ శ్రీనివాస్

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు ఆచార్య ఎన్జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన 'ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ గేమ్స్, కల్చరల్ అండ్ లిటరరీ మీట్-2025'లో ఉత్తమ ప్రతిభ కనబరచి ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను సాధించారు. ఈ పోటీలను ఆచార్య ఎన్జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన నంద్యాల జిల్లాలోని మహానంది వ్యవసాయ కళాశాలలో జనవరి 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ నిర్వహించారు. ఆచార్య ఎన్జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన 20 వ్యవసాయ పాలిటెక్నిక్‌లకు చెందిన 375 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. పలు ఈవెంట్స్‌లో 8 పెద్ద కప్పులు, 18 షీల్డ్‌లు మొత్తంగా 26 బహుమతులు పొందడం విశేషం. ఈ సందర్భంగా క్రీడా, సాంస్కృతిక పోటీలలో విజయం సాధించి, ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను సాధించిన విద్యార్థులను అభినందిస్తూ సోమవారం సాయంత్రం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడిఆర్, ప్రిన్సిపల్ డాక్టర్ టి.శ్రీనివాస్ అధ్యక్షతన అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విజేతలైన విద్యార్థులను అభినందిస్తూ, చదువుతో పాటూ క్రీడలలో కూడా రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశించారు. ఈ క్రీడా సాంస్కృతిక పోటీలలో పాల్గొన్న విద్యార్థుల వెన్నంటి ఉండి ఈ విజయానికి కారకులైన ఫిజికల్ డైరెక్టర్ కె.రమేష్, స్టూడెంట్స్ ఆక్టివిటీస్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆర్.షాలెం రాజు, టీచింగ్ అసిస్టెంట్ పి.యశస్విలకు ప్రత్యేక అభినందలు తెలిపారు. తరువాత క్రీడా పోటీలలో పాల్గొన్న విద్యార్థులు తమ అనుభవాలను తెలియజేశారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ పాలిటెక్నిక్, మార్టేరుకు గుర్తింపు తీసుకువచ్చిన విద్యార్థులను వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.శ్రీనివాస రావు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణాజీ, పాలిటెక్నిక్ సిబ్బంది అభినందించారు.

పంట కాలువలో చనిపోయిన కోళ్లు

ఆందోళనలో రైతులు

నరసాపురం : జిన్నూరు పంట కాలువలో చనిపోయిన కోళ్లను సంచుల్లో మూటలుగా కట్టి కాలువలో పడేస్తున్నారు. గత కొన్ని రోజులుగా కాలువలో చనిపోయిన కోళ్ల మూటలు కాలువ వెంబడి కొట్టుకురావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితితో కాలువలో నీరు కలుషితం కావడంతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలు రోగాల బారిన పడతారని సాగునీటి సంఘ అధ్యక్షుడు ఆందోళన వ్యక్తం చేశారు. పరిస్థితిని జలవనరులశాఖ డిఇఇ సిహెచ్.వెంకట నారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సోమవారం జిన్నూరు పంట కాలువను మల్లవరం, కొప్పర్రు గ్రామాల పరిధిలో పరిశీలించారు. కాలువలో చెట్ల కొమ్మలకు అడ్డుపడి చనిపోయిన కోళ్ల సంచుల మూటలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జలవనరులశాఖ డిఇఇ వెంకట నారాయణ మాట్లాడుతూ ఇటీవల కోళ్లకు రోగాలు రావడంతో కోళ్ల ఫారం యజమానులు చనిపోయిన కోళ్లను పంట కాలువలో పడేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ విషయమై కాలువ ఎగువన ఉన్న పెరవలి, ఉండ్రాజవరం తదితర మండలాల్లోని పౌల్ట్రీ ఫారం యజమానులకు మంగళవారం నుంచి తానే జలవనరులశాఖ సిబ్బందితో వెళ్లి స్వయంగా నోటీసులు అందజేస్తానన్నారు. డివిజన్ పరిధిలోని జల వనరులశాఖ ఎఇఇలకు కోళ్ల ఫారాలపై నిఘా ఉంచాల్సిందిగా కోరతామన్నారు. చనిపోయిన కోళ్లను గొయ్యి తీసి కప్పెట్టాలని సూచించారు. అలాకాకుండా పంట కాలువల్లో పడేసే కోళ్ల ఫారంలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గీత కార్మికులకు 3 మద్యం దుకాణాలు

నరసాపురం : నరసాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 3 మద్యం దుకాణాలను గీత కులాలకు కేటాయించినట్లు సిఐ ఎస్.రాంబాబు తెలిపారు. మండలంలోని నరసాపురం టౌన్, మొగల్తూరు మండలంలో ఒక్కో షాపు శెట్టిబలిజ కులానికి కేటాయించినట్లు చెప్పారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు రూ.2 లక్షల రుసుము చెల్లించి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు స్టేషన్లో సంప్రదించాలని సిఐ రాంబాబు అన్నారు. ఇప్పటి వరకు దరఖాస్తులు ఒక్కటి కూడా అందలేదన్నారు.

'పది' విద్యార్థి జీవితంలో కీలకం

పాలకొల్లు : 10వ తరగతి పరీక్షలు విద్యార్థి జీవితంలో కీలక ఘట్టం అని, విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని యుకెసి గవర్నర్ పెనుమాక రామ్మోహన్ చెప్పారు. పాలకొల్లు బిఆర్ఎంవి మున్సిపల్ హైస్కూల్లో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ ద్వారా 100 మందికి ఎస్-ఎస్‌సి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుకెఎస్‌సి ఇంటర్నేషనల్ ట్రైనర్ మద్దాల వాసు, యుకెఎస్‌సి ట్రెసి ఛైర్మెన్ మంగిన సాయి, యుకెసి అధ్యక్షులు జక్కంపూడి మదన్, స్కూల్ ఎన్‌సిసి అధికారి సూర్య నారాయణ రాజు, పీడీ ఉదయ్ కుమార్ హాజరు అయ్యారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ

మొగల్తూరు : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ డిమాండ్ చేశారు. మొగల్తూరులోని సిపిఎం కార్యాలయంలో సోమవారం సిఐటియు జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం చాలా దారుణం అన్నారు. ఈనెల 5న జరగనున్న నిరసన ర్యాలీలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.పెద్దింట్లు, ఎస్.సారమ్మ, నాగలక్ష్మి, వీర పాండు, ఎ.సీత, బొసు బాబు, అడ్డాల ఏడుకొండలు ఉన్నారు.

ఎపిపిగా శివరామకృష్ణ బాధ్యతల స్వీకరణ

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెంలో నూతనంగా ప్రారంభించిన 11వ అదనపు జిల్లా కోర్టు ప్రథమ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది కుసులూరి శివరామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు గాను, ప్రధాన కార్యదర్శి గాను, సబ్ కోర్ట్ ఎపిపిగా, అడిషనల్ సిపిగా సమర్థవంతంగా పనిచేశారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకునిగా కూడా పనిచేశారు. ఈయన నియామకం పట్ల బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులు తోట రాంబాబు, మాకా శ్రీనివాసరావు, ఎం.మాధవబాబు, ముప్పిడి సురేష్ రెడ్డి, కె.హరనాథ్, జి.ముఖర్జీ, కె.నాగేశ్వరరావు, కొవ్వూరి అప్పిరెడ్డి, జి.గోపీకృష్ణ, సిరిగినీడి విజయకృష్ణ, జి.దుర్గాదేవి, తోట సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ కంకట శ్రీనివాస్, సెక్రటరీ నారాయణ స్వామి, సత్యనారాయణమూర్తి, అడ్వకేట్ క్లర్క్ ప్రెసిడెంట్ సూర్యచంద్రరావు, సీతారామయ్య, శేషగిరి, కోర్ట్ సిబ్బంది, పోలీస్ అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రాసిక్యూటర్‌గా బాధితుల తరపున వాదించి, వారికి తగు న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. 11వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి షేక్ సికిందర్ బాషా నూతన బాధ్యతలు తీసుకొన్న కుసులూరి శివ రామకృష్ణకు పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

శివరామకృష్ణను అభినందిస్తున్న జిల్లా జడ్జి సికిందర్ బాషా

గాయపడ్డ విద్యార్థికి సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు జిబిఎస్‌విఆర్ మున్సిపల్ పాఠశాలలో 2వ తరగతి చదువుతున్న కుశల్ ఈశ్వర్(7) ఇటీవల ఉండి గ్రామంలో భోగి మంటల్లో పడి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పాఠశాల హెచ్ఎం భవానీప్రసాద్ రాయపూడిని తీవ్రంగా కలచివేసింది. తనదైన శైలిలో విద్యార్థికి అన్ని విధాల అండగా నిలిచారు. ప్రస్తుతం విద్యార్థి భీమవరంలోని సాయి సుగిత్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విద్యార్థి పేద కుటుంబం కావడంతో అత్యుత్తమ చికిత్స అందించడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న హెచ్ఎం బాధితుడికి, వారి తల్లిదండ్రులకు అన్ని విధాల అండగా నిలిచారు. యుఎఇ శెట్టిబలిజ ఐక్య సంఘం నుంచి రూ.34,350ను విరాళంగా సేకరించి సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. హాస్పిటల్ మెడికల్ బిల్లులకు సంబంధించి రూ.20 వేలు వంశీకృష్ణ బెంగళూరు వారు, కొయ్యలగూడెం మండలం కన్నాపురం గ్రామానికి చెందిన జనసేన నాయకులు, మిత్రులు హాస్పిటల్ మెయింటినెన్స్ నిమిత్తం రూ.14 వేలు, ఇతరులు కలిసి(యుఎఇ శెట్టిబలిజ ఐక్యవేదిక) రూ.లక్ష 15 వేలు మొత్తం రూ.లక్షా 49 వేలు బాధిత విద్యార్థి వైద్య ఖర్చుల నిమిత్తం హెచ్ఎం చేతుల మీదుగా విద్యార్థి సమక్షంలో తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ కె.పాపారావు, వైస్ ఛైర్మన్ సున్నం కళ్యాణి, ప్రభాకర్, లక్ష్మి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి : మంత్రి నిమ్మల

భోగిమంటలో పడి 80 శాతం శరీరం కాలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పాలకొల్లు జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాల విద్యార్థి కుశల్ ఈశ్వర్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించి మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వైద్య సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థికి సకాలంలో సహాయం చేసి, మెరుగైన చికిత్స అందించే విధంగా, దాతల సహకారంతో చిత్తశుద్ధితో కృషి చేస్తున్న హెచ్ఎం రాయపూడి భవాని ప్రసాద్‌ను మంత్రి అభినందించారు. తన పూర్తి సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు.

వైఎన్‌లో చరిత్రపై అతిథోపన్యాసం

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక శ్రీవైఎన్ కళాశాలలో చరిత్ర, రాజకీయ శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో భారత ఉపఖండం పూర్వ చరిత్ర అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనివర్శిటీ ఆఫ్ హైదారాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ కెపి.రావు మాట్లాడుతూ మన భారతదేశ చరిత్ర సుమారు ఇరవై లక్షల సంవత్సరాల కాలం నాటిదని, పురావస్తు శాఖ తవ్వకాల ఆధారంగా దీనిని కనుగొనడం జరిగిందన్నారు. ఈ చరిత్ర కాలాన్ని రాతి యుగం, ఖనిజ యుగం అని రెండు కాలాలుగా చెప్పడం జరిగిందని, వాటిని మరలా మూడు విధాలుగా విభజించారన్నారు. పాలెయోలిథిక్ - పాత రాతి యుగం, మెసోలిథిక్ - మధ్య రాతి యుగం, నియోలిథిక్ - ఆధునిక రాతి యుగం అనే కాలాలుగా విభజించి వాటిని మరలా అనేక విభాగాలుగా చెప్పడం జరిగిందన్నారు. ఆయా కాలాల్లో మనిషి ఉపయోగించిన రాతి పనిముట్లు స్థానే ఈ కాలంలో మనిషికి కావలసిన విధంగా ఖనిజ పనిముట్లుగా మార్చామని, అదేవిధంగా అనేక విధాలుగా మన భారత ఉపఖండం పూర్వ వైభవాన్ని రెండు భాగాలుగా అనగా ఉత్తర, దక్షిణ భారత ప్రాంతాలుగా విభజిస్తూ, ఆయా ప్రాంతాల్లో ఏవిధంగా మానవులు తమ జీవితాన్ని గడిపారో విద్యార్థులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనకరావు, డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ, హెచ్ఆర్‌డి డైరెక్టర్ డాక్టర్ చినమిల్లి శ్రీనివాస్, హిస్టరీ హెడ్ ఎస్.సోమశేఖర్, పాలిటిక్స్ హెడ్ డాక్టర్ కమ్మిల రంగారావు, ఫిజిక్స్ హెడ్ డాక్టర్ అప్పన ఫణి, ఫిజిక్స్ అధ్యాపకులు డాక్టర్ మల్లేశ్వరరావు, పరిమి రామకృష్ణ, సుందర్ సింగ్, ఐఎల్ ఎం.సారంగపాణి, బయోటెక్ పుష్ప, మైక్రో బయాలజీ రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యతా శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక శ్రీవైఎన్ కళాశాల జాతీయ సేవా విభాగం, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు జరిగే జాతీయ సమైక్యత శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వై.శ్రీనివాసరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 రాష్ట్రాల నుంచి ఇక్కడికి విచ్చేసిన పిఒ స్టాఫ్‌కు అభినందనలు తెలియజేస్తూ, ఎన్నో ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు, కట్టుబాట్లు అన్నీ కలగలిపి ఉన్న దేశమే మన భారతదేశం అని, ఎన్నో దేశాల సమాహారమే మన భారతదేశం కాబట్టి దీనిని ఉపఖండంగా భావిస్తారన్నారు. ప్రపంచ దేశాల్లో మన దేశం ఎల్లప్పుడూ ప్రత్యేక స్థానంలో ఉంటుందని, అటువంటి దేశంలో గల రాష్ట్రాల నుంచి మీరంతా వచ్చినందుకు ఈ మధ్య గల సమైక్యతను చాటి చెప్పాలని ఇటువంటి శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మీ ఆచార వ్యవహారాలను గౌరవిస్తూ, మీ ఆలోచన ధోరణిని పంచుకుంటూ ముందుకెళ్లాలని ఆశిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ రావు, కోశాధికారి పోలిశెట్టి రఘురామారావు, కవరింగ్ బాడీ సభ్యులు డాక్టర్ వర్మ, కళాశాల డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ, ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎన్ఎస్-ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య పి.వెంకటేశ్వరరావు, రీజనల్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు కరాటే శిక్షణ

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక శ్రీదాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థినులకు కరాటేలో మాస్టర్ డి.ప్రకాష్‌చే శిక్షణ ఇవ్వబడుతుందని ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి తెలిపారు. కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినులకు రమేష్ మాస్టారుచే శిక్షణ ఇవ్వబడుతుందని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్, ఫిజికల్ డైరెక్టర్ రమేష్, డాక్టర్ రమణ, సంధ్య, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు

తాడేపల్లిగూడెం : స్థానిక చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 300 మందికి ఉచితంగా పరీక్షలు జరిపి చికిత్స అందించారు. ఈ శిబిరం ద్వారా పది లక్షల రూపాయలకుపైగా విలువైన వైద్యసేవలతో పాటు మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. విజయవాడ కామినేని హాస్పిటల్-తాడేపల్లిగూడెం చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి గుండె సంబంధిత వ్యాధులు, ఆయాసం, ఉబ్బసం, అన్ని రకాల శ్వాసకోశ వ్యాధులు, షుగర్, బి.పి, పక్షవాతం, అన్ని రకాల నరాల సంబంధిత వ్యాధులు, అన్ని జనరల్ వ్యాధులకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. తాడేపల్లిగూడెం చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్ నిర్వాహకులు సోమేశ్వరరావు పేషెంట్లకు, వారితోపాటు వచ్చిన వారికి అల్పాహార, భోజన ఏర్పాట్లు చేశారు.

పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నాయకర్‌ను పరామర్శించిన చిన్నా

ప్రజాశక్తి - నరసాపురం

మచిలీపట్నంలో ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ కారుకి ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ప్రమాదం అనంతరం ఎంఎల్ఎ నాయకర్ నరసాపురంలోని తన నివాసానికి క్షేమంగా చేరుకున్నారు. సోమవారం ఎంఎల్ఎ నాయకర్‌ను ఆయన నివాసంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీ కృష్ణ(చిన్నా) కలిశారు. నాయకర్ యోగ క్షేమాలు, ప్రమాదానికి గల కారణాలు చిన్నా అడిగి తెలుసుకున్నారు.

పాస్‌పోర్టు పోయినది

ప॥గో॥జిల్లా, పెనుగొండ మండలం, వడాలి గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన బీల సూర్యకుమారి తండ్రి: రాంబాబు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. ఇంటి దగ్గర నుండి జిరాక్స్ సెంటరుకు వెళు తుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయింది. పాస్‌పోర్ట్ నెం. R2787148 గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

బీల సూర్యకుమారి
తండ్రి: రాంబాబు
డోర్ నెం. 5-8/1, రామాలయం వీధి,
జాంపేట, వడలి, పెనుగొండ మండలం,
ప॥గో॥ జిల్లా - 534325
సెల్: 99632 44221

వేలం ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు- నూజివీడు
ఇ.పి.నెం.91/2014 ఇన్
యల్.ఏ.ఓ.పి.నెం.22/2011

బిట్వీన్:
నామాల వెంకటరావు వగైరాలు ...డి.హెచ్.ఆర్/క్లైయింట్
మరియు
ది రెవిన్యూ డివిజినల్ ఆఫీసర్. నూజివీడు ...జే.డి.ఆర్

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి పై తెలిపిన జె.డి.ఆర్. యొక్క సంపూర్ణ సాధీన హక్కుభుక్తములలో వుండి పై తెలిపిన జె.డి.ఆర్. గారి కార్యాలయంలో ఈ డిక్రీ బాకీ క్రింద జప్తు ఛార్జి కాబడి, వేలం కావలసియున్న చరాస్థి వివరం:

1) కంప్యూటర్స్	- 10	- రూ. 35,000/-
2) కుర్చీలు	- 20	- రూ. 15,000/-
3) టేబుల్స్	- 20	- రూ. 15,000/-
4) సీలింగ్ ఫ్యాన్లు	- 10	- రూ. 7,000/-
మొత్తం		రూ. 72,000/-

డి.హెచ్.ఆర్ విలువ రూ. 50,000/-
అమీనా విలువ Rs. 72,000/-

పైన తెలిపిన ఆస్థిని శ్రీ కోర్టు వారు **ది. 13-02-2025వ తేదీన ఉ.గం. 10-30 ని.లకు** బహిరంగ వేలం వేయుదురు. కావున కావల్సినవారు పాడుకొనవచ్చును.
(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

యమ్. రమేష్
నూజివీడు డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది
ది.01-02-2025 నూజివీడు
సెల్: 94402 57636

In The Court Of The First Addl. Civil Judge (Junior Division) Tanuku

I.A.No.539/2020 in O.S.No.640/2020 and O.S.No.640/2020

Between:
Padala Satyanarayana Reddy
... Petitioner & Plaintiff
and
Mudundi Subbalakshmi & Others
...**Defendants & Respondents**

D3: .Chiluvuri Manideepika,
W/o. Seeta Rama Raju,
R/o. Oduru (Penumantra Mandal)

వాది మరియు పిటీషనర్ తరుపున వేయించిన ప్రకటన

ఇందు మూలముగా 3వ ప్రతివాదికి పై నంబరు దావా O.S. No. 640/2020 లోనూ, I.A. No. 539/2020 పిటిషను లోను కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారు నోటీసు పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేసియున్నారు. కావున **ది. 24-02-2025వ తేదీన ఉదయం 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, లాయరు ద్వారా గానీ హాజరు అయి అభ్యంతరములు తెలుపు కొనవలెను. లేనియెడల మీ పరోక్షములో దావా మరియు పిటీషన్లు విచారణ చేసి తీర్మాణం చేయబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

గుడిమెట్ల వీర్రెడ్డి
తణుకు వాది తరుపు న్యాయవాది
తేది:03-02-2025 Cell: 94406 07793

మహారాజశ్రీ 1st ఎడిషినల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) Cum-1st ఎడిషినల్ మెజిస్ట్రేట్ ఆఫ్ 1st Class తాడేపల్లిగూడెం వారి కోర్టులో

O.S.No. 401/2022

Between:
నాయన లక్ష్మణరెడ్డి ***... Plaintiff***
And
కొప్పర్తి ఆదినారాయణ వగైరా ***... Defendants***

పై నెంబరు దావా గ్రంధములో 1st Defendant అయిన కొప్పర్తి ఆదినారాయణ S/o వెంకటరత్నం, Male, Age 45 Years, Business, Plot No.-503, శ్రీ సాయి సత్యం టవర్స్, 3టౌన్, opp: LIC Office, భీమవరం, W.G.Dt. అను మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్ని పర్యాయములు సమన్లు జారీ చేసిననూ, మీరు తీసుకొనక తప్పించుకుని తిరుగుతూ కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు Substitute of Service ద్వారా మీకు సమన్లు జారీ చేయవలసినదిగా ఆర్డరు యిచ్చియున్నారు. సదరు పై నెంబరు దావా **ది.17-02-2025వ తేదీకి** వాయిదా అయి ఉన్నది. కావున మీరు **ది.17-02-2025వ తేదీ ఉదయం గం. 10-30 ని.లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, మీ ప్లీడరు గారి ద్వారా గానీ హాజరయి మీ ఆక్షేపణలను తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షమున ఈ దావా తీర్మానము చేయబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

తాడూరి లీలామాధవ్
సి.పి.ఆర్.రెడ్డి (రాజమండ్రి)
తాడేపల్లిగూడెం అడ్వకేట్స్
ది.02-2-2025 తాడేపల్లిగూడెం
సెల్: 94408 52182
93464 09563